www.aakshitha.com

People's voice


# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

బుధవారం | 16 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08



## యువత ముంగిటకు ఉద్యోగాల మేళా

**300 కంపెనీల్లో 3,500 మందికి ఉద్యోగాలు**



నిరుద్యోగ యువతకు పరిశ్రమల అనుసంధానమే పరిష్కారం

19న సూర్యాపేట జిల్లా కోదాడలో మెగా జాబ్‌మేళా


ఎంపికైన అభ్యర్థులకు అక్కడికక్కడే అపాయింట్మెంట్ లెటర్లు

ప్రతి అభ్యర్థికి ఐదు సంస్థల్లో ఇంటర్వ్యూ అవకాశాలు

మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

# బాబు 'బస్తీ' రాజ్యం !






**అంతా ఆ రెండెకరాల చుట్టే**

**పవర్ హౌస్‌లో పవర్ దందా**

**ఏ పవర్‌హౌస్ బస్తీలో "బాబు" అక్రమసామ్రాజ్యం**

**వడ్డీ నుంచి రియల్ ఎస్టేట్ వరకు..!**

**పరిచయాలే పెట్టుబడిగా దందాల విస్తరణ**

భద్రాద్రి కొత్తగూడెం, అక్షిత న్యూస్ : కొత్తగూడెం ఏ పవర్‌హౌస్ బస్తీలో ఒకప్పుడు ప్రజా వ్యవహారాల్లో చురుగ్గా కనిపించిన నాయకత్వం.. ఇప్పుడు వ్యక్తిగత వ్యవహారాలకు అడ్డాగా మారిందన్న చర్చ స్థానికంగా సాగుతోంది. పదవి ద్వారా ఏర్పడిన పరిచయాలు, అధికారులతో ఉన్న సాన్నిహిత్యం వ్యాపార వ్యవహారాలకు ..మిగతా 2లో

## నత్తనడకన బ్రిడ్జి పనులు!

**సికెఎం కాలేజీ వద్ద కొనసాగుతున్న బ్రిడ్జి పనులు**

భారీ వినాయక విగ్రహాల తరలింపుపై భక్తుల్లో ఆందోళన!!

కావాలని ఆలస్యమా? పట్టింపు లేని పాలకుల చేష్టలు కారణమా?

రాజకీయ అవసరాల్లో పాలకులు, సేవలు అందక ప్రజల ఇక్కట్లు



**వరంగల్, అక్షిత బ్యూరో:** వంతెన పనులు నత్తకు నడకలు నేర్పే పరిస్థితి. వినాయక నిమజ్జనో త్సవాలు సమీపిస్తున్న దేశాయిపేట సికెఎం కాలేజీ సమీపంలోని చిన్న వడ్డేపల్లి చెరువు బ్రిడ్జి వద్ద రోడ్డు పనులు ఇంకా కొనసాగుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో ..మిగతా 2లో

## చదువుకుంటేనే ఉజ్వల భవిత



**కోయిలకొండలో**

**కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీలు**

**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** కోయిలకొండ మండల పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మండల కేంద్రంలోని ఎంపిడి.ఓ కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి.హెచ్.సి), బిసి బాలుర సంక్షేమ వసతి గృహం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాలు, సంస్థల్లో అందుతున్న సేవలు, సిబ్బంది హాజరు, వైద్య సేవలు, మందుల లభ్యత, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, పారిశుద్ధ్య పరిస్థితులను కలెక్టర్ పరిశీలించారు. ఎం.పి.డి.ఓ ..మిగతా 2లో

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



## నత్తనడకన బ్రిడ్జి పనులు!

**మొదటి పేజీ తరువాయి...**

వినాయక విగ్రహాలు ఈ మార్గం గుండా తరలించే అవకాశం ఉండటంతో, నిమజ్జనోత్సవాల నాటికి రోడ్డు పనులు పూర్తవుతాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వరంగల్ నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వినాయక విగ్రహాలను చిన్న వడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేస్తుంటారు. అయితే కొందరు మండపాల నిర్వాహకులు ఐదో రోజునే నిమజ్జనం నిర్వహించనుండటంతో ఈ మార్గంలో భారీ విగ్రహాలు, వాహనాల రాకపోకలు ప్రారంభం కానున్నాయి. దీంతో రోడ్డు పనులు పూర్తికాకపోతే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

**బ్రిడ్జిపై పెరిగిన రోడ్డు ఎత్తు?**

బ్రిడ్జిపై రోడ్డు మార్గం ఎక్కువగా ఎత్తు పెరిగి ఉండటంతో భారీ వినాయక విగ్రహాలను తరలించే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరమవుతున్నాయి. విగ్రహాలు, వాహనాలు సురక్షితంగా వెళ్లేలా రోడ్డు మార్గాన్ని సరిచేసి, అవసరమైన పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**కార్పొరేటర్ల పదవీకాలం పూర్తి.. పట్టించుకునేదెవరు?**

ఇదిలా ఉండగా, నగర కార్పొరేటర్ల పదవీకాలం పూర్తవడంతో స్థానిక సమస్యలను ప్రజల తరఫున అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఒత్తిడి చేసే ప్రజాప్రతినిధులు లేకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. ప్రజా సమస్యలపై ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులే లేకపోతే.. సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

వినాయక నిమజ్జనానికి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బ్రిడ్జి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. భారీ విగ్రహాల తరలింపుతో పాటు భక్తులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జన మార్గాన్ని సురక్షితంగా సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## చదువుకుంటేనే ఉజ్వల భవిత

**మొదటి పేజీ తరువాయి...**

కార్యాలయంలో పిటిషన్లు, సిబ్బంది హాజరు పరిశీలన ముందుగా ఎం.పి.డి.ఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన పిటిషన్లు, దరఖాస్తులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల ఆన్‌లైన్‌లో నమోదవుతున్న హాజరు వివరాలను తనిఖీ చేశారు. డైలీ సిట్యుయేషన్ రిపోర్ట్ (డి.ఎస్.ఆర్), ఫేస్ రికగ్నిషన్ ద్వారా నమోదవుతున్న హాజరు వివరాలను ఎంపిడిఓ లాగిన్‌లో పరిశీలించారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన బూరుగుపల్లి సర్పంచ్‌తో కలెక్టర్ మాట్లాడి గ్రామంలో పెండింగ్ బిల్లులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, నిధుల వినియోగం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామీణ యాప్‌లో నమోదైన వివరాలు, వివిధ పథకాల అమలు, నిధుల వినియోగానికి సంబంధించిన అంశాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత వివరాలను ఎం.పి.డి.ఓ ద్వారా సర్పంచ్‌కు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు.సర్పంచ్ తెలిపిన చెక్కులపై సంతకాల సమస్యపై ఉపసర్పంచ్‌ను పిలిపించి మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఎం.పి.డి.ఓకు సూచించారు.

**సిహెచ్‌సిలో వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా**

అనంతరం జిల్లా కలెక్టర్ సిహెచ్.సి సందర్శించి ఆసుపత్రిలోని రిజిస్టర్లు, మందుల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు. కొంతమంది రోగులు ఐరన్ మాత్రలు, ఇన్సులిన్ ఇంజెక్షన్లు అందుబాటులో లేవని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ వెంటనే స్పందించారు. జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి ఇన్సులిన్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు వెంటనే స్పందించి ఇన్సులిన్‌ను తెప్పించి సంబంధిత రోగికి అందించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా అని ఆరా తీసిన కలెక్టర్, ఉదయం అందించిన అల్పాహారం వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు.

పాఠశాలలో పారిశుద్ధ్యం, విద్యార్థుల సౌకర్యాల పరిశీలన అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

# బాబు "బస్తీ" రాజ్యం

**మొదటి పేజీ తరువాయి...**




ఉపయోగపడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వడ్డీ వ్యాపారం, చిట్టీలు, నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు, భూముల క్రయవిక్రయాలు ఇలా ఒక్కో రంగంలో కార్యకలాపాలు విస్తరించాయన్న ప్రచారం ఉంది. అధికారులు మారుతున్నా పరిచయాల వలయం మాత్రం కొనసాగుతోందన్న చర్చ స్థానికంగా ఉంది.

**టెండర్ ఒకరి పేరు..**
**పనులు మరొకరి చేతిలో**

ప్రభుత్వ, సింగరేణి పనుల విషయంలోనూ పలు అంశాలు చర్చకు వస్తున్నాయి. టెండర్ ఎవరి పేరుతో దక్కింది, పనులు వాస్తవంగా ఎవరు నిర్వహిస్తున్నారు, సైట్‌లో వ్యవహారాలు చూసేది ఎవరు, బిల్లులు ఎవరి పేరుతో చెల్లింపవుతున్నాయనే వివరాలు బయటకు రావాల్సి ఉంది.కాంట్రాక్టర్ అర్హతలు, టెండర్ పత్రాలు, వర్క్ ఆర్డర్లు, పనుల కొలతలు, బిల్లుల వివరాలను పరిశీలిస్తే అసలు వ్యవహారం స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**రెండు ఎకరాల భూమి చుట్టూ చర్చ**

పవర్‌హౌస్ బస్తీలో సుమారు రెండు ఎకరాల స్థలానికి సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. భూమి హక్కులు, రికార్డుల్లో ఉన్న పేర్లు, ప్రస్తుత వినియోగం, వాస్తవ లబ్ధిదారుల వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది.అది ప్రభుత్వ భూమా, సింగరేణి భూమా, ప్రైవేటు స్థలమా అనేది రెవెన్యూ, సింగరేణి, రిజిస్ట్రేషన్ రికార్డుల పరిశీలనతో తేలనుంది. బినామీ పేర్లతో భూముల కొనుగోలు, విక్రయాలు జరిగాయన్న సమాచారం కూడా స్థానికంగా చర్చకు వస్తోంది. పేరు ఒకరిది, పెట్టుబడి మరొకరిదిగా వ్యవహారం సాగిందా అనే కోణంలోనూ పరిశీలన జరగాల్సి ఉంది.

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఆర్థిక లావాదేవీలు, యాజమాన్య హక్కులను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి బయటపడే అవకాశం ఉంది.

**వడ్డీ నుంచి భూముల వరకు**

వడ్డీకి డబ్బులు ఇవ్వడం, చిట్టీల నిర్వహణ, అప్పులు చెల్లించలేని పరిస్థితుల్లో ఆస్తులపై ఒత్తిడి, అనంతరం భూముల వ్యవహారాల్లోకి ప్రవేశం వంటి అంశాలపై స్థానికంగా చర్చ సాగుతోంది. అప్పులు తీసుకున్న వారిపై ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వీటికి సంబంధించి ఫిర్యాదులు, లావాదేవీల వివరాలు, ఆధారాలు వెలుగులోకి రావాల్సి ఉంది. నిర్మాణ అనుమతులు, బోరు పర్మిషన్లు, ఇతర శాఖల అనుమతుల విషయంలోనూ మనోడి దందాపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ ప్రజలకు ఎక్కువ సమయం పట్టే ప్రక్రియలు కొందరికి త్వరగా పూర్తవుతున్నాయన్న చర్చ ఉంది.అధికార పరిచయాల ప్రభావం ఏ మేరకు ఉందో సంబంధిత శాఖల రికార్డుల పరిశీలనతో స్పష్టమవుతుంది.ఇసుక, కలప, ఇతర నిర్మాణ సామగ్రి తరలింపులో నిబంధనలు పాటించారా, సంబంధిత అనుమతులు ఉన్నాయా అనే అంశాలను కూడా అధికారులు పరిశీలించాల్సి ఉంది.

**ఆస్తుల పెరుగుదలపై లెక్కలు**

ప్రజాజీవితంలోకి వచ్చిన సమయంలో ఉన్న ఆస్తులు, ప్రస్తుతం ఉన్న ఆస్తుల వివరాలను పోల్చి చూస్తే ఆర్థిక పరిస్థితిలో వచ్చిన మార్పులు స్పష్టమయ్యే అవకాశం ఉంది. మధ్యకాలంలో జరిగిన భూములు, స్థలాల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు, పెట్టుబడుల మూలాలపై రికార్డుల ఆధారంగా పరిశీలన జరగాల్సి ఉంది.

**రికార్డులు బయటపడితే అసలు లెక్క**

భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, కాంట్రాక్టు టెండర్లు, వర్క్ ఆర్డర్లు, బిల్లులు, నిర్మాణ అనుమతులు, బోరు పర్మిషన్లు, వడ్డీ, చిట్టీల లావాదేవీలను సమగ్రంగా పరిశీలిస్తే పలు అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.పదవి ద్వారా ఏర్పడిన పరిచయాలు వ్యాపారాలకు ఉపయోగపడ్డాయా, కాంట్రాక్టు పనుల్లో వాస్తవ లబ్ధిదారులు ఎవరు, భూ వ్యవహారాల్లో అసలు హక్కుదారులు ఎవరు అనే అంశాలు అధికారిక విచారణతోనే తేలాల్సి ఉంది.

# యువత ముంగిటకు ఉద్యోగాల మేళా

**300 కంపెనీల్లో**
**3,500 మందికి ఉద్యోగాలు**

**నిరుద్యోగ యువతకు పరిశ్రమల అనుసంధానమే పరిష్కారం**

**19న సూర్యాపేట జిల్లా కోదాడలో మెగా జాబ్‌మేళా**

**ఎంపికైన అభ్యర్థులకు అక్కడికక్కడే అపాయింట్‌మెంట్ లెటర్లు**

**ప్రతి అభ్యర్థికి ఐదు సంస్థల్లో ఇంటర్వ్యూ అవకాశాలు**

**మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**

సూర్యాపేట, అక్షిత బ్యూరో : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యావంతులైన నిరుద్యోగ యువతకు, ప్రముఖ పారిశ్రామిక సంస్థలకు మధ్య బలమైన, నిరంతర అనుసంధానం ఏర్పడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.గ్రామీణ యువతలో ప్రతిభకు కొదవ లేకపోయినా,సంఘటిత రంగంలోని ఉద్యోగావకాశాలను అందుకునేందుకు సరైన వేదిక లేకపోవడమే ప్రధాన సమస్యగా మారిందన్నారు.ఈ అంతరాన్ని తొలగించేందుకు ప్రభుత్వం వ్యవస్థీకృత కార్యాచరణతో ముందుకు సాగుతోందని చెప్పారు.సెప్టెంబర్ 19న సూర్యాపేట జిల్లాలోని కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లపై మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు, వందకు పైగా విద్యా సంస్థల ప్రతినిధులు,స్థానిక అధికారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. విద్యావంతులైన యువతలో నిరుద్యోగం సమాజాన్ని వేధిస్తున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువత పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీతో పాటు వివిధ వృత్తి విద్యాకోర్సులు చదివించేందుకు తల్లిదండ్రులు తమ ఆర్థిక స్థోమతకు మించి ఖర్చు చేస్తున్నప్పటికీ, చదువు పూర్తయిన తరువాత పిల్లలకు తగిన ఉద్యోగాలు లభించక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు.తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా తన సుదీర్ఘ ప్రజా జీవితంలో ఇటువంటి తల్లిదండ్రులను అనేకమందిని కలిశానని చెప్పారు.మునగాల వంటి గ్రామంలో చదివిన ఇంజినీరింగ్ లేదా వృత్తి విద్యా పట్టభద్రుడికి హైదరాబాద్‌లో నివసించే యువకుడితో సమానంగా ప్రముఖ కంపెనీలను సంప్రదించే అవకాశం ఉండదని మంత్రి పేర్కొన్నారు.

"గ్రామీణ యువత ప్రముఖ కంపెనీల వద్దకు సులభంగా చేరుకోలేకపోతే, ఆ కంపెనీలనే గ్రామీణ యువత ముంగిటకు తీసుకురావాలి. అదే కోదాడ మెగా జాబ్‌మేళా ప్రధాన ఉద్దేశం"అని మంత్రి స్పష్టం చేశారు.ఒకే ప్రాంగణంలో అనేక సంస్థల ప్రతినిధులను కలిసి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం గ్రామీణ నిరుద్యోగులకు కల్పించనున్నట్లు చెప్పారు. అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఒక్కొక్కరికి ఐదు సంస్థల్లో ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గత ఏడాది హుజూర్ నగర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో 200కు పైగా కంపెనీలు పాల్గొనగా, ఈసారి కోదాడ జాబ్‌మేళాకు సుమారు 300 కంపెనీలను ఆహ్వానించినట్లు మంత్రి వెల్లడించారు.హైదరాబాద్‌తో పాటు వివిధ పారిశ్రామిక ప్రాంతాలకు చెందిన ప్రముఖ సంస్థలు,ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న పరిశ్రమలను ఇందులో భాగస్వాములను చేస్తున్నట్లు వివరించారు. అపోలో గ్రూప్, జీఎంఆర్, రాంకీ, మహీంద్రా అండ్ మహీంద్రాతో పాటు సిమెంట్, తయారీ సేవలు, ఐటీ, ఫార్మా, నిర్మాణ, వ్యాపార రంగాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలను సంప్రదిస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతి పరిశ్రమ జాబ్‌మేళాలో పాల్గొనేలా పరిశ్రమల శాఖ అధికారులు వ్యక్తిగతంగా సంప్రదించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, పరిశ్రమల శాఖ, సింగరేణి సంస్థ సమన్వయంతో ఈ నియామక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ జాబ్‌మేళా ద్వారా 3,500 మందికి పైగా యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని మంత్రి చెప్పారు.

# ఇంజనీర్ల సేవలు దేశ అభివృద్ధికి కీలకం

**మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళులు**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** ఇంజనీర్ల సేవలు దేశ అభివృద్ధిలో అత్యంత కీలకమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన మౌలిక వసతుల కల్పనలో ఇంజనీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుల నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.

ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా హనుమ కొండ జిల్లా ప్రజాప్రతినిధుల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.



స్థానిక ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి భారతదేశ ప్రఖ్యాత ఇంజనీర్, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోక్ష గుండం విశ్వేశ్వరయ్య దేశ నిర్మాణంలో అందించిన సేవలు, ఇంజనీరింగ్ రంగానికి చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులు అందించడంలో ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

హనుమకొండ జిల్లా ప్రజాప్రతినిధుల కార్యాలయ పరిధిలోని జడ్పీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. జడ్పీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, నిధులు కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శిథిలావస్థకు చేరుకున్న భవనం స్థానంలో ఆధునిక సౌకర్యాలతో నూతన కార్యాలయ భవనం ఏర్పాటు చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇ.వి శ్రీనివాస్ రావు, స్థానిక ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్వతం నన్ను పరీక్షించింది... నేను విజయంతో సమాధానం ఇచ్చాను

**ఖర్దుంగ్ లా ఛాలెంజ్‌లో 72 కి.మీ. పరుగును పూర్తి చేసిన ఏ.ఆర్. కానిస్టేబుల్ అనిల్‌కు జిల్లా ఎస్పీ అభినందనలు**




**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఏ. ఆర్ కానిస్టేబుల్ అనిల్ లడక్ లో నిర్వహించిన ఖర్దుంగ్ లా ఛాలెంజ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి 72 కిలోమీటర్ల అల్ట్రా మారథాన్‌ను 13 గంటల 23 నిమిషాల 54 సెకన్లలో విజయవంతంగా పూర్తి చేశారు.సముద్ర మట్టానికి సుమారు 17,618 అడుగుల ఎత్తులో, అత్యంత కఠినమైన కొండ ప్రాంతాలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటూ పట్టుదల, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని పూర్తి చేయడంతో పాటుగా మరుసటి రోజు లాడక్ మర్థన్ 42.2 కి. మీ కూడా పూర్తి చేయదం జరిగింది.

ప్రజాసేవలో నిరంతరం విధులు నిర్వర్తిస్తూనే ఇటువంటి ప్రతిష్టాత్మక ఈవెంట్లలో పాల్గొంటూ విజయాలు సాధించడం ద్వారా పోలీస్ ఫోర్స్‌లోని యువ సిబ్బందికి అనిల్ ఆదర్శంగా నిలిచారని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇటువంటి పోటీల్లో మరింత ప్రావీణ్యం సంపాదించి, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఖర్దుంగ్ లా పర్వత మార్గం నా శారీరక, మానసిక సామర్థ్యాలకు ఒక కఠినమైన పరీక్షగా నిలిచింది. ప్రతి అడుగు నా పరిమితులను పరీక్షించినప్పటికీ, నా ఆత్మస్థైర్యాన్ని మాత్రం ఓడించలేకపోయింది. ఎన్ని సవాళ్లు ఎదురైనా లక్ష్యాన్ని చేరుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగి 72 కి.మీ. పరుగును పూర్తి చేశానని అనిల్ తెలిపారు

## హర్షిక జన్మదినం సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

**కౌడిపల్లి, అక్షిత న్యూస్:** వెల్మకన్న గ్రామంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామ సర్పంచ్ కుమ్మరి శివలీల సతీష్ తమ కుమార్తె హర్షిక జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. గ్రామంలోని సీపీఎస్ ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న



విద్యార్థినీ విద్యార్థులకు బ్యాగులను అందజేశారు.

విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించడం పట్ల పలువురు అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు శోభారాణి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సరోజన, మాజీ వైస్ ఎంపీపీ బొడ్ల నవీన్ గుప్తా, ఉపసర్పంచ్ ప్రభు రవి సాగర్, వార్డు సభ్యులు వహీదా బేగం, రజాక్, కుమ్మరి చంద్రకళ, వెంకటేశం, గణేష్, శత్రు, వడ్ల నాగభూషణం, అబ్దుల్, అశోక్, సాయి గౌడ్, నలువాల సతీష్ కుమార్, కర్ణం కుమ్మరి శ్రీనివాస్, వెంకటయ్య రెడ్డి, వెంకటయ్య, జంగిటి వెంకటేశం, గుడ్సాబ్, నలువాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్యులగూడెం హైస్కూల్ విద్యార్థులకు ఉచిత యూనిఫామ్ పంపిణీ



**చిలుకూరు, సెప్టెంబర్ 15 (అక్షిత న్యూస్):** ఆచార్యుల గూడెంలో సర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మీ బిక్షం చేతుల మీదుగా ఉచిత యూనిఫాం పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమానత్వ భావన పెంపొందించడంలో యూనిఫాం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు. యూనిఫాంలు అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మరియుపాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లి దండ్రులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## దివిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

**విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ**




**చౌటుప్పల్ / అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మండల కేంద్రం కుంట్ల గూడెం గ్రామంలోని ప్రాథమిక,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం దివిస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలను పంచాయతీ కార్యదర్శి భవాని చేతులమీదుగా ప్రారంభించి నిర్వహించారు. డాక్టర్ జయంత్ కుమార్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొని విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు కంటి పరీక్షలు కూడా నిర్వహించి అవసరమైన విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు 99,248 వేల రూపాయల విలువగల 2527 రాత పుస్తకాలను ఉచితంగా అందజేశారు. విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పుస్తకాలను అందజేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, దివిస్ ప్రతినిధులు బి గోపి,జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న మోగుదాల పావని రమేష్ గౌడ్

**వర్ష బాధితులకు అండగా నిత్యవసర సరుకులు అందజేత**



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లక్ష్మి దంపతుల సేవా మార్గాన్ని ఆదర్శంగా తీసుకుంటూ, చౌటుప్పల్ పురపాలక చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మానవత్వాన్ని చాటుకున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరి నిత్యావసర వస్తువులు నీట మునిగిన మూడు నిరుపేద కుటుంబాలకు మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ దంపతులు స్పందించి బాధిత కుటుంబీకులకు 50 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను వారి చేతులు మీదుగా మంగళవారం బాధిత కుటుంబాలకు స్వయంగా అందజేశారు. కష్టకాలంలో స్పందించి సహాయం అందించిన చైర్‌పర్సన్ ను స్థానిక ప్రజలు అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాక చిరంజీవి,కాలనీవాసులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



## సాయిస్ఫూర్తిలో ఇంజనీర్స్ డే వేడుకలు



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తిఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ అన్ని బ్రాంచీలు,డిప్లొమా మరియు యంబిఎ విద్యార్థినీ,విద్యార్థులు మంగళవారం రోజు సెప్టెంబర్-15 పురస్కరించుకుని భారతదేశంలో ప్రతి సంవత్సరం జరుపుకొనే ఇంజనీర్స్ డే కళాశాల ఎన్ యస్ యస్ విభాగం, కళాశాల యాజమాన్యం సంయుక్తాధ్వర్యంలో కళాశాల ప్రాశీగణం లో ఘనంగా జరుపుకున్నారు.ఈ వేడుకకు ముఖ్య అతిధిగా కళాశాల సెక్రటరీ,కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి స్వాగతోపన్యాసం చేశారు.ఎన్నో ఆనకట్టలకు, పరిశ్రమలకు ఊపిరి పోసిన గొప్ప దార్శినికుడు, ఇంజనీరింగ్ ప్రతిభను దేశ, విదేశాల్లో చాటిచెప్పిన మేటి ఇంజనీర్, భారతదేశ నీటిపారుదల వ్యవస్థను సంస్కరించి కీలక ప్రాజెక్టుల రూపొందించిన ప్రజ్ఞాశాలి మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆ మహనీయుని జయంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాధికులు, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత,రాజ్యసభ సభ్యులు మరియు సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ బండి.పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ బండి.అన్విద వర్చువల్ గా పాల్గొని ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్,అన్ని ఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు, కళాశాల డిప్లొమా డీన్,ఎన్ యస్ యస్ ప్రోగ్రాంఆఫీసర్ బలుసుపాటి సీతారాములు అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళికపై తొలి గ్రామసభ నిర్వహణ



**అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి:** ఉల్సాయిపాలెం గ్రామ పంచాయతీలో వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా తొలి గ్రామసభను మంగళవారం సర్పంచ్ రాత్ల మోతీలాల్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి లోకిలాల్ గృహ నిర్మాణ శాఖ మాట్లాడుతూ,ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతలు, వ్యవసాయ పొలాల్లో నీటి నిల్వ గుంతలు,డ్రెయిన్‌లకు అనుబంధంగా నీటి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు .గ్రామాభివృద్ధి ప్రణాళికలో ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు.కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి హందాని,మండల పంచాయతీ అధికారి మొహ్సిన్ బిన్ అహ్మద్,సహాయ ప్రణాళిక అధికారి సూరా నాయక్,గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్,మండలంలోని పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి హామీ సిబ్బంది,క్షేత్ర సహాయకులు, పాలకవర్గ సభ్యులు,ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిందే కేసీఆర్

**ఈనెల 17 న అన్ని తాండాల్లో సంబురాలు జరపాలి**

**మాజీ మంత్రి,సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి**



**సూర్యాపేట , అక్షిత బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలోని తండాలను గ్రామ పంచాయతీ లుగా చేసిన ఘనత కేసీఆర్ దేనని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సూర్యాపేట నియోజకవర్గ గిరిజన నేతలతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తోనే గిరిజనులకు రాజ్యాధికారం సాధ్యమైందని అన్నారు. రాష్ట్రంలో తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గిరిజనులకు రిజర్వేషన్ 6 శాతం నుండి 10 శాతం వరకు పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు.అందుకోసం 2022 లో కెసిఆర్ శ్రీకారం చుట్టిన సెప్టెంబర్ 17 గిరిజనులకు పండుగ రోజుగా వర్ణించారు.ఆ రోజున అన్ని తండాల్లో జరుపుకోబోయే సంబరాలు అంబరాన్నంటాలని పిలుపునిచ్చారు.ఎంతో మంది విద్యార్థులకు నాణ్య మైన విద్యను అందించిన గిరిజన గురుకులాలు మన కళ్ళ ముందే కనబడుతున్నాయని,గిరిజనుల అభివృద్ధి,ఎస్టీ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కు చట్ట బద్ధత కల్పించిన ఘనత కూడా కెసిఆర్ దేనని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్ ల పేరుతో మభ్య పెట్టి గిరిజనులను లను మోసం చేసిందని ఆరోపించారు.ఎస్టీలకు మూడు కార్పొరేషన్ లు ఏర్పాటు చేసి,ఏడాదికి రూ.500 కోట్లు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని రంగాల్లోనూ. వైఫల్యం చెందిందని అభిప్రాయ పడ్డారు.అటువంటి ప్రభుత్వాన్ని ఎండ గట్టేందుకు గిరిజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన కెసిఆర్ రుణం తీర్చుకునేందుకు గిరిజనులంతా సిద్ధం కావాలని కోరారు.ఈ సమావేశంలో పలువురు బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

**256 మంది లబ్ధిదారులకు రూ.1.30 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**ఎమ్మెల్యే బిఎల్ఆర్**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ అన్నారు.

మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బిఎల్ఆర్ నియోజకవర్గానికి చెందిన 256 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1 కోటి 30 లక్షల 50 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందన్నారు. ప్రజలకు అవసర సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు.

నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం బైక్ ర్యాలీ



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిపిఎం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లాలో బైక్ ర్యాలీ నిర్వహించారు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను ప్రజలకు తెలియజేయడం, నాటి పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీపీఎం నాయకులు తెలిపారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం సాగించిన పోరాటం చారిత్రకమైనదని నాయకులు పేర్కొన్నారు. పేదలు, రైతులు, కూలీల హక్కుల కోసం నాటి కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు చేసిన త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

రాజన్న సిరిసిల్ల ప్రాంతానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ప్రత్యేక అనుబంధం ఉందని నాయకులు గుర్తుచేశారు. బద్దం ఎల్లారెడ్డి, అమృతులాల్ శుక్ల, తిరుపతిరెడ్డి, కర్రోళ్ల నర్సయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి వంటి పలువురు నాయకులు ఈ ప్రాంతంలో ప్రజలను సమీకరించి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించారని తెలిపారు.

తెలంగాణ సాయుధ పోరాటాన్ని కేవలం మతపరమైన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని సీపీఎం నాయకులు అన్నారు. దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా పేదలు, రైతులు, కూలీలు సాగించిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వంటి పోరాట యోధుల స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లాలో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో సభలు, ర్యాలీలు, స్మరణ కార్యక్రమాల ద్వారా నాటి పోరాట చరిత్రను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు.


బైక్ ర్యాలీలో సీపీఎం జిల్లా నాయకులు, మండల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఎర్రజెండాలతో సాగిన ర్యాలీ సందర్భంగా రైతాంగ పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మోసం రమేష్ కోడం రమణ రాజశేఖర్ జయరాం లక్ష్మణ్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు

## మహిళా పంచాయతీ

# కార్యదర్శులకు భద్రత ఏది?

### మారుమూల గ్రామాల్లో విధులు.. రవాణా సౌకర్యం లేక అవస్థలు

### విధులు ముగిసినా ఇంటికి చేరే వరకు ఆందోళనే.. పిల్లల చదువులు, కుటుంబ బాధ్యతలతో సతమతం




**నిర్మల్ అక్షిత బ్యూరో బ్యూరో, సెప్టెంబర్ 15:** గ్రామపంచాయతీల పరిపాలనలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళా పంచాయతీ కార్యదర్శులకు భద్రత, రవాణా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మల్ జిల్లాలోని పలు గ్రామపంచాయతీల్లో మహిళా పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తూ గ్రామాల అభివృద్ధి, ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. అయితే మారుమూల గ్రామపంచాయతీలకు రాకపోకలకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడం, దూర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ ప్రయాణించాల్సి రావడం వల్ల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది.

ఉదయం ఇంటి నుంచి విధులకు బయలుదేరే మహిళా ఉద్యోగులు సుదూర గ్రామాలకు చేరుకునేందుకు ముందుగానే బయలుదేరాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో బస్సుల సౌకర్యం పరిమితంగా ఉండటంతో అందుబాటులో ఉన్న రవాణా మార్గాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణ సమయం పెరగడంతో పాటు విధులకు వెళ్లడం, తిరిగి ఇంటికి చేరడం కూడా వారికి సవాల్‌గా మారుతోంది.

**విధులు ముగిసినా.. ఇంటికి చేరే వరకు ఆందోళనే**

సాయంత్రం విధులు ముగిసిన వెంటనే ఇంటికి చేరే అవకాశం లేకపోవడంతో మహిళా ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు. బస్సు కోసం వేచి ఉండటం, బస్సులు లేకపోతే ప్రత్యామ్నాయ రవాణా కోసం ప్రయత్నించడం వంటి పరిస్థితులతో ఇంటికి చేరే సమయం ఆలస్యమవుతోంది. మహిళా ఉద్యోగులు ఇంటికి చేరే వరకు పిల్లలు, కుటుంబ సభ్యులు ఎదురుచూడాల్సి వస్తోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు ఉన్న మహిళా పంచాయతీ కార్యదర్శులకు ఈ సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. ఉదయం పిల్లలను పాఠశాలకు పంపించడం, ఇంటి పనులు పూర్తి చేయడం అనంతరం దూరంలోని గ్రామపంచాయతీకి విధులకు వెళ్లాల్సి ఉంటుంది. సాయంత్రం విధులు ముగిసిన తర్వాత ఇంటికి చేరే వరకు మరో ప్రయాణం ఉంటుంది. తల్లి ఇంటికి వచ్చే వరకు పిల్లలు ఎదురు చూడాల్సి రావడం, ఇంటికి చేరిన తర్వాత కూడా పిల్లల చదువులు చూసుకోవడం, వారికి అవసరమైన పనులు చేయడం వంటి బాధ్యతలను నిర్వర్తించాల్సి వస్తోంది.

**ఉద్యోగంతో పాటు కుటుంబ బాధ్యతలు**

రోజంతా విధుల్లో ఉండి, సుదూర ప్రయాణం చేసి ఇంటికి చేరిన తర్వాత కూడా మహిళలకు విశ్రాంతి లభించని పరిస్థితి నెలకొంటోంది. పిల్లల చదువులు, ఇంటి పనులు, కుటుంబ సభ్యుల అవసరాలు చూసుకోవడంతో రోజంతా శ్రమించిన మహిళలు మరింత అలసిపోతున్నారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగిగా విధులను సమర్థవంతంగా నిర్వర్తించాల్సి ఉండగా, మరోవైపు తల్లిగా పిల్లల సంరక్షణ, చదువులు, కుటుంబ బాధ్యతలను కూడా చూసుకోవాల్సి వస్తోంది. ఈ రెండు బాధ్యతలను సమన్వయం చేసుకోవడంలో రవాణా సౌకర్యాల లేమి తమపై అదనపు భారాన్ని మోపుతోందని మహిళా పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**భద్రతపై ప్రత్యేక చర్యలు అవసరం**

మహిళా ఉద్యోగులు విధులకు వెళ్లే సమయంలో, విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చే సమయంలో వారి భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఎండ, వర్షం, చలికాలం అనే తేడా లేకుండా ప్రతిరోజూ విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. ముఖ్యంగా రవాణా సౌకర్యాలు తక్కువగా ఉన్న మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారుతోంది. పురుష ఉద్యోగులు వ్యక్తిగత వాహనాల ద్వారా ఎలాగోలా విధులకు చేరుకునే అవకాశం ఉన్నప్పటికీ, ప్రతి మహిళా ఉద్యోగికి సొంత వాహనం ఉండటం సాధ్యం కాదని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో బాధ్యతలు అప్పగించే సమయంలో మహిళా ఉద్యోగుల భద్రత, ప్రయాణ సౌకర్యం, కుటుంబ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

**నిర్మల్ జిల్లాలో సమగ్రంగా పరిశీలించాలి**

నిర్మల్ జిల్లాలోని అన్ని మండలాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఏయే గ్రామపంచాయతీలకు బస్సు సౌకర్యం లేదు.. మహిళా కార్యదర్శులు ఎంత దూరం నుంచి ప్రతిరోజూ ప్రయాణిస్తున్నారు.. విధులు ముగిసిన తర్వాత ఇంటికి చేరేందుకు ఎంత సమయం పడుతోంది.. కుటుంబ, పిల్లల బాధ్యతలపై ఎలాంటి ప్రభావం పడుతోంది అనే అంశాలపై అధికారులు వివరాలు సేకరించాలని మహిళా ఉద్యోగులు కోరుతున్నారు. రవాణా సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో మహిళా పంచాయతీ కార్యదర్శులకు విధులు కేటాయించడం, అవసరమైన చోట్ల బదిలీలు లేదా పరస్పర సర్దుబాట్లను పరిశీలించడం ద్వారా సమస్యలను కొంతవరకు పరిష్కరించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

మహిళలు ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న నేపథ్యంలో వారి భద్రత, సౌకర్యాల విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిర్మల్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మహిళా పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిశీలించి, వారికి రవాణా మరియు భద్రతకు అనుకూలమైన విధులు కల్పించాలని వారు కోరుతున్నారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూ కుటుంబ బాధ్యతలను కూడా మోస్తున్న మహిళా పంచాయతీ కార్యదర్శులకు అధికారుల సహకారం అందితేనే వారు మరింత ప్రశాంతంగా, భద్రతతో విధులు నిర్వహించగలరని మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అడవిదేవులపల్లి మండలానికి రూ.3.12 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి:** పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి సిఎంఆర్ఎఫ్ ఆర్థిక అండగా నిలుస్తోందని మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిలా శ్రీనివాస్ అన్నారు.మంగళవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా అడవిదేవులపల్లి మండలానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.3,12,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పొదిలా శ్రీనివాస్ మాట్లాడుతూ,నిరుపేదలు మరియు మధ్యతరగతి కుటుంబాలు అత్యవసర వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసానిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని పేర్కొన్నారు.అడవిదేవులపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులలో రామావత్ పద్మ,కొత్తనందికొండ రూ.22,000,సోమనబోయిన నవ్య,అడవిదేవులపల్లి రూ.14,000, చింత రామదేవి, అడవిదేవులపల్లి రూ.26,000,చెవుల పుష్ప, నడిగడ్డ రూ.26,000,అలుగుల వెంకటరావమ్మ, అడవిదేవులపల్లి రూ.19,000, మారెబోయిన కొండాలు, కొత్తనందికొండ రూ.17,500, రామావత్ రాందాసు, మొల్కచెర్ల రూ.53,000, రామావత్ మంజుల,కొత్త నందికొండ రూ.44,000,జల్లడ నిత్యశ్రీ బేబీ, ముదిమాణిక్యం రూ.30,500,నంద్యాల గణేష్, అడవిదేవులపల్లి రూ.60,000 విలువైన చెక్కులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు,అడవిదేవులపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వీరాంజనేయులు, అడ్వకేట్ కంచుకొమ్మల శ్రీనివాస్,పెద్దింటి రామ్మూర్తి, నారాయణ,గుండా శ్రీను,వార్డ్ మెంబర్ వీరబోయిన వెంకటేశ్వర్లు,దుండిగల నాగరాజు,మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజాబాటలో విద్యుత్ సమస్యల పరిష్కారం



**అక్షిత న్యూస్ మునగాల:** ప్రజల విద్యుత్ సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు కలకోవ గ్రామంలో ఏఈ ఎం. వికాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను అధికారులు పరిశీలించారు

ఈ సందర్భంగా గ్రామస్థులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కారణంగా ఏర్పడుతున్న అంతరాయాలను గుర్తించిఅవసరమైన చోట చెట్ల కొమ్మలను తొలగించడం నూతన స్తంభాలను ఏర్పాటు చేయడం,విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండవ వెంకటాద్రి, ఫోర్‌మెన్ కిషోర్ లైన్‌మెన్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు లచ్చిరెడ్డి, రమేష్ మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాస్తదితరులు పాల్గొన్నారు.

## పామపూర్‌లో ఆర్‌పీఎల్ శిక్షణ,

# రైతులకు మెళకువలు



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పామపూర్ గ్రామ పంచాయతీలో గురువారం ఆత్మ ఆధ్వర్యంలో ఆర్‌పీఎల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం మదనాపురం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు వరిలో సమగ్ర సస్య రక్షణ నేల ఆరోగ్య యాజమాన్యం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చన్నారు. యూరియా ఎక్కువగా వాడితే దోమ పోటు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పంటలకు పోషకాలను సమతుల్యంగా అందించడం, నేల సారాన్ని కాపాడుకోవడం, ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జాస్మిన్, సీడీసీ చైర్మన్ చంద్ర మోహన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి మానస, కేవీకే సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లండన్‌లో అంబేద్కర్ స్మృతి భవనాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉన్నత విద్యను అభ్యసించిన రోజుల్లో లండన్‌లో నివసించిన చారిత్రక భవనాన్ని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, సందర్శించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్మృతి భవనంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తన జీవితకాలంలో ఈ భవనంతో కలిగి ఉన్న అనుబంధానికి గుర్తుగా భారత ప్రభుత్వం ఈ భవనాన్ని కొనుగోలు చేసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్మృతి భవన్‌లి 'గా అభివృద్ధి చేసిందని తెలిపారు. అంబేద్కర్ విద్యాభ్యాసం, ఆయన ఆలోచనా విధానం, సామాజిక న్యాయం కోసం సాగించిన పోరాటంతో ముడిపడి ఉన్న ఈ చారిత్రక ప్రదేశాన్ని సందర్శించడం ఎంతో గర్వంగా ఉందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. విద్యకు అంబేద్కర్ ఇచ్చిన ప్రాధాన్యత, జ్ఞానం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలన్న ఆయన ఆలోచనలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించడంలో అంబేద్కర్ పోషించిన పాత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని అన్నారు. అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలను కాపాడుతూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

## వినాయకుడి ఆశీస్సులతో ఉప్పల్ మరింత అభివృద్ధి చెందాలి: బండారి



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, సెప్టెంబర్ 15:** వినాయకుడి ఆశీస్సులతో ఉప్పల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉప్పల్ జోనల్ కార్యాలయంలో ప్రత్యేక వినాయక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాతో కలిసి ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. గణనాథుడి కృపతో ఉప్పల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలకు శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా జోనల్ కార్యాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్ జోనల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గిరిజనులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. అంబెడ్కర్ అభయహస్తం పథకం ద్వారా ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షలకు ఇస్తామని ఇవ్వలేదు. ప్రభుత్వ ప్రొక్యూర్మెంట్.. కాంట్రాక్టు లలో 12 శాతం ఎస్టీలకు రిజర్వేషన్ ఇస్తామని మోసం చేసారు.

పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మాట తప్పిందని అన్నారు.

గిరిజన విద్యార్థుల విద్య జ్యోతి పథకం ద్వారా చదువు కోసం రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రోత్సాహకం అందిస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం హామీని విస్మరించిందన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం లో గిరిజనుల జనాభాకు అనుగుణంగా ఎస్టీలకు 10% రిజర్వేషన్ లు ఇవ్వడం జరిగింది.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 3,146 తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించామని, తద్వారా సుమారు 30 వేల మంది గిరిజనులు ప్రజాప్రతినిధులుగా ఎదిగే అవకాశం కల్పించడం జరిగింది.

హైదరాబాద్‌లో సేవలాల్ బంజారా భవన్, కొమురం భీం ఆదివాసీ భవన్ ను నిర్మించుకోవడం జరిగింది. గిరిజనుల కోసం సుమారు రూ.100 కోట్ల ఆస్తులు, రూ.25 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.

తండాలకు విద్యుత్ సదుపాయం కల్పించడంతో పాటు ఇంటింటికీ తాగునీరు అందించడం జరిగింది.

కేసీఆర్ పదేళ్ల పాలనలో తండాల్లో జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి, గురుకులాలు, వసతి గృహాల్లో నాణ్యమైన విద్య, వసతి, భోజన సౌకర్యాలు కల్పించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాలు, వసతి గృహాల్లో పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయి. మూడు సంవత్సరాలు గడుస్తున్నా గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దారుణమని, రాజకీయంగా కూడా గిరిజనులకు తగిన అవకాశాలు కల్పించడం లేదన్నారు.

గిరిజన కార్పొరేషన్లకు తగిన నిధులు కేటాయించి గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలన్నారు.గురుకుల విద్యాలయాలు.. వసతి గృహాల నిర్వహణ సరిగ్గా లేదు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జేఏసీ చైర్మన్ ప్రతాప్ నాయక్, బీ ఆర్ ఎస్ పార్టీ హన్వాడ ఎస్టిసెల్ అధ్యక్షులు హరిచందర్, కార్పొరేటర్ రమేష్ నాయక్, సీనియర్ నాయకులు రమేష్ నాయక్, రవీందర్ నాయక్, పూర్య నాయక్, సురేష్ నాయక్, మోహన్ నాయక్, రవి నాయక్. అంబు నాయక్, నెహ్రూ నాయక్, రాజేష్ నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

### సాంకేతిక ఆలోచనలు సృజనాత్మకతతో దేశాభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులకు పిలుపు

**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని ఆలోచనలకు రూపమిచ్చి అభివృద్ధికి దిశానిర్దేశం చేసేవారే ఇంజనీర్లు అనే సందేశంతో ఇంజనీర్స్ డే వేడుకలను త్రివేణి పాఠశాల ఖమ్మం శాఖలో ఘనంగా నిర్వహించారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

ఇంజనీరింగ్ రంగానికి దేశ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.



ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ దేశ ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవాలని అన్నారు.ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపే దిశగా విద్యార్థులు ఆలోచించాలని సూచించారు. సర్ ఎం విశ్వేశ్వరయ్య జీవితం సేవలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంజనీరింగ్ రంగం ప్రాముఖ్యత వివిధ విభాగాలు దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్రపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సిఆర్ఓ కాట్రగడ్డ మురళికృష్ణ వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్ ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయులు నాన్-టీచింగ్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

### భూ రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించిన

# జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, సెప్టెంబర్ 15:** వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని వసంతపూర్ గ్రామంలో మంగళవారం భూ రీసర్వే ప్రక్రియపై గ్రామసభ నిర్వహించారూ.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీసర్వే ద్వారా భూ హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పక్కాగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రీసర్వే ప్రక్రియలో రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను



పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అనంతరం వరంగల్ మండలంలోని కొత్తపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఫీల్డ్ రీసర్వే పనులను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె కిషోర్ కుమార్, ఆర్డీవో సుమ, ఏడి శ్రీనివాసులు,తహసీల్దార్లు శ్రీకాంత్ ,ఇక్బాల్,తో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూత్పూర్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

## ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి



**దేవరకద్ర ,అక్షిత న్యూస్:** భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న మౌలిక వసతులు, వివిధ సమస్యలపై కౌన్సిలర్లు, అధికారులతో ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి, పరిపాలనా అంశాలపై చర్చించి, వివిధ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

అనంతరం కౌన్సిలర్లు తమ, తమ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

ప్రధానంగా విద్యుత్ సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా, పారిశు ధ్యం, ఫాగింగ్, రోడ్లు, తదితర మౌలిక వసతుల సమస్యలను కౌన్సిలర్లు ఎమ్మెల్యే కి వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి



మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు, లైన్లు, ఇతర సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా డ్రైనేజీ సమస్యలు, మురుగు నీటి పారుదల, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

మిషన్ భగీరథ ద్వారా ప్రతి కుటుంబానికి తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వర్షాకాలం, దోమల వ్యాప్తిని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ పరిధిలో ఫాగింగ్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.

ప్రజల నుంచి వచ్చే సమస్యలను కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

భూత్పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి హామీ ఇచ్చారు, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రాధాన్యతగా ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు.

ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, అధికారులు, కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు, కో ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కోదాడకు బుల్లెట్ రైలు మార్గం అన్ని రంగాలలో అభివృద్ధి

## అఖిలపక్ష నాయకులు కనగాల నారాయణ

**కోదాడ అక్షిత ప్రతినిధి:** బుల్లెట్ రైలు మార్గం కోదాడ మీదిగా వెళ్లినట్లయితే కోదాడ పట్టణం పరిసర ప్రాంతాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతాయని బుల్లెట్ రైలు సాధన సమితి నాయకులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని పబ్లిక్ క్లబ్ లో కనగాల నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన బుల్లెట్ రైలు సాధన సమితి సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ముందుగా అఖిలపక్ష నాయకులతో రైలు సాధన సమితి కమిటీని ఏర్పాటు చేయాలని దీనివలన కార్యచరణ రూపొందించుకోవడానికి మార్గం సులభతరం అవుతుందని తెలిపారు . అలాగే ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో సాధన సమితి కమిటీ ఇచ్చిన పిలుపును అందుకొని ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ముఖ్యంగా కోదాడ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక అభివృద్ధి రవాణా సౌకర్యాలు,





ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ -- సూర్యాపేట -- కోదాడ -- విజయవాడ -- చెన్నై మార్గంలో బుల్లెట్ ట్రైన్‌ను కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తిలు చేయాలని కమిటీ నిర్ణయించింది.

ఈ ప్రాంతం ద్వారా బుల్లెట్ ట్రైన్ అనుసంధానం జరిగితే కోదాడతో పాటు సూర్యాపేట జిల్లా ప్రజలకు విద్య, వైద్యం, ఉద్యోగాలు, వ్యాపారం, పరిశ్రమలు పెట్టుబడుల పరంగా ఎంతో ప్రయోజనం తో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు .బుల్లెట్ రైలు మార్గం వచ్చినట్లయితే హైదరాబాద్--కోదాడ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గి, భవిష్యత్‌లో కోదాడను ఒక ముఖ్యమైన రవాణా కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది. పార్టీలకు అతీతంగా ఉద్యమాలు నిర్వహించాలని ఐక్యమత్యంతో ఉద్యమాలు నిర్వహించి కోదాడకి బుల్లెట్ రైలు మార్గాన్ని సాధించుకోవచ్చని వక్తలు అభిప్రాయాలను వెల్లడించారు కనగాల నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓరుగంటి ప్రభాకర్ రావు, పైడిమర్రి వెంకటనారాయణ, ఇమ్మడి రమేష్, నూనె సులోచన, పాలూరి సత్యనారాయణ బొలిశెట్టి కృష్ణయ్య, జూలకంటి శ్రీనివాసరావు, కర్రి సుబ్బారావు, చింతబాబుమాదిగ,పసుపులేటి రామారావు, పగిడి

రామారావు,అంబడికర్ర శ్రీనివాసరావు కట్టా సతీష్,భూమాశ్రీనివాసరావు,, చిలుకూరు శ్రీనివాసరావు, రాకేష్ రెడ్డి, సైదా నాయక్, వెంకటరెడ్డి, శ్రీహరి, వాణిజ్య వ్యాపార సంఘాలు ప్రతినిధులు కుల సంఘాలు ప్రతినిధులు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

# ఉపాధి కూలీలు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలి

## సర్పంచ్ దున్నా శ్రీనివాస్



**నడిగూడెం, అక్షిత న్యూస్:** కూలీలకు ఉపాధి కల్పన ధ్యేయంగా గ్రామంలో ఉపాధి పనులు చేపడుతున్నారని కూలీలు తమ పని దినాలను సద్విని యోగం చేసుకోవాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో చౌదరి చెరువు నందు ఫిష్ పాండు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ అంజిరెడ్డి మాట్లాడుతూ నిర్దేశించిన కొలత ప్రకారం పనులు చేస్తూ ఉపాధి కూలీలు పూర్తి వేతనం పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, వార్డు సభ్యులు ధర్నా లింగయ్య, నాగారపు సరస్వతి రాము, గుండు మహేందర్ ప్రసాద్, కాసాని మాధవి గోపీనాథ్, షేక్ నాజయా రియాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, ఉపాధి కూలీలు గుండు వెంకన్న, దున్న అర్జున్,పాలకి రంగయ్య, తదితరులు పాల్గొన్నారు..

# విద్యార్థి మంచి ప్రయోజకుడు కావాలంటే ఉపాధ్యాయుల వల్లే సాధ్యం

## మూడు చింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** ఒక విద్యార్థి మంచి ప్రయోజకుడు కావాలంటే అది ఉపాధ్యాయులు చెప్పే విద్యావల్లె అవుతుందని మున్సిపల్ చైర్మన్ జాము రవి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని రైతు వేదికలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపకాలను, ప్రశంసా పాత్రాన్ని అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. విద్య వల్ల మనిషికి సంస్కారం వస్తదని తెలిపారు. పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. మున్సిపల్ నుండి మండల్, డిస్ట్రిక్ట్ ఫస్ట్ వస్తే వారు ఎంతవరకు చదువుకుంటే అంతరవరకు నా సొంత డబ్బులతో చదివిస్తానని జాము రవి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి తహసిల్దార్ గులాం ఇద్రీష్, కమిషనర్ వెంకట గోపాల్, ఎంఈవో భాగ్యమణి, పి ఆర్ టి యు అధ్యక్షుడు రాజి రెడ్డి, కౌన్సిలర్లు లత వెంకట్ రెడ్డి, శ్రీవాణి వైద్యనాథ్, సరిత శ్రీనివాస్, రాజు, రమేష్, ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, సుబ్బారావు, శ్రీనివాస్, ప్రభాకర్, సంధ్య, రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పాము కాటుకు గుర్రై పాడి గేదె మృతి



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** పాము కాటుకు గుర్రై పాడి గేదె మృతి చెందిన సంఘటన చేర్యాల మండలంలోని చుంచనకోట గ్రామంలో చోటుచేసుకుంది. యేషబోయిన సంజీవులు అనే రైతుకు చెందిన పాడి గేదె తన వ్యవసాయ భావి వద్ద మేత మేస్తున్న సమయంలో పాముకాటుకు గుర్రై అక్కడికక్కడే మృతి చెందిందని, సుమారు గేదె విలువ 45 వేల రూపాయల వరకు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

